క్లుప్తంగా

జాబ్ మేళాను సద్వినియోగం చేసుకోవాలి

నిడమనూరు : ఈనెల 24వ తేదీ హాలియాలో నిర్వహించే జాబ్ మేళాను నిరుద్యోగులు సద్వినియోగం చేసుకోవాలని ఏకే ఫౌండేషన్ చైర్మన్ కట్టెబోయిన అనిల్ కుమార్ మంగళవారం కోరారు. 18–30 వయస్సు ఉన్న ఆడ, మగ అభ్యర్థులు పదోతరగతి నుంచి ఎంఎల్‌టీ, బీఎస్సీ నర్సింగ్, డిగ్రీ, డిప్లమా, ఐటీఐ, బీటెక్ అర్హత కలిగినవారు హాజరుకావాలన్నారు. టాటా స్ట్రైవ్, ప్రీమియర్ హెల్త్ కేర్, శ్రీవిజయా బయోఫర్టిలైజర్ ఉంకా స్థానికంగా ఉన్న కంపెనీ ప్రతినిధులు అభ్యర్థులను సెలక్ట్ చేసుకుంటారని ఆయన తెలిపారు. శుక్రవారం ఉదయం 11 గంటల నుంచి ఇంటర్వ్యూలు నిర్వహిస్తారని అభ్యర్థులు తప్పని సరిగా హాజరుకావాలని కోరారు.

దివ్యాంగులకు బస్‌పాస్‌లు అందజేత

డిండి : మండల పరిధిలోని తవక్లాపూర్ గ్రామంలో మండలంలోని దివ్యాంగులకు డోనర్స్ క్లబ్ ఆధ్వర్యంలో మంగళవారం ఉచిత బస్‌పాసులను అందజేశారు. ఈ కార్యక్రమానికి దేవరకొండ ఆర్టీసీ డిపో అసిస్టెంట్ మేనేజర్ భారతీబాయి ముఖ్య అతిథిగా హాజరై బస్‌పాసులను అందజేశారు.ఈ కార్యక్రమంలో డోనర్స్ క్లబ్ సభ్యులు జగన్‌మోహన్‌రెడ్డి, పొన్నగంటి కృష్ణయ్య, కె.వెంకట్‌రెడ్డి, భయ్యా వెంకటయ్య, రమేష్, పరమేష్, శివ, శ్రీను, ఆర్‌టీసీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

స్టడీ మెటీరియల్ పంపిణీ

మిర్యాలగూడ అర్బన్ : పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న అభ్యర్థులకు మంగళవారం పట్టణంలోని గ్రంథాలయ భవనంలో ఎన్‌బీఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో 150మార్కులతో జనరల్ స్టడీస్ మోడల్ పరీక్షను నిర్వహించారు. ఈ పరీక్షకు 312మంది విద్యార్థులు హాజరు కాగా ఉత్తమ ప్రతిభ కనబర్చిన బోగోజు భవాని, జానిపాష, సుభాని లకు గ్రూప్ ఫోర్ మెటీరియల్‌ను అందజేశారు. సద్దుల సైదులు, శిరసనగండ్ల శ్రీకాంత్‌చారి గ్రంథాలయ ఇన్‌చార్జ్ కుమ్మరికుంట్ల సుధాకర్ పర్యవేక్షణలో పరీక్షను నిర్వహించారు.

కార్మికుడి కుటుంబానికి పరామర్శ

మిర్యాలగూడ అర్బన్ : అనారోగ్యంతో కొద్ది రోజులుగా ఇబ్బందులు పడుతున్న పెయింటింగ్ కార్మికుడు మన్నెపురెడ్డి కుటుంబాన్ని మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి మంగళవారం సీఐటీయూ నాయకులతో కలసి పరామర్శించారు. నిత్యావసర వస్తువులతో పాటు ఆర్థిక సాయం అందజేసిన అనంతరం వైద్యం వివరాలను అడిగి తెలుసుకుని కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ రాష్ట్ర నాయకులు డబ్బికార్ మల్లేష్, నాయకులు గౌతంరెడ్డి, మంగారెడ్డి, పరశురాములు, రవినాయక్, బిఎం .నాయుడు, పాల్గొన్నారు.

ఫణికుమార్‌కు యంగ్ సైంటిస్ట్ అవార్డు



వేములపల్లి : మండల కేంద్రానికి చెందిన ఫణికుమార్ తెలంగాణ అకాడమీ సైన్సెస్ కాకతీయ యూనివర్సిటీలోని బయోటెక్నాలజీ డాక్టర్ ఫెల్లోగా పరిశోధనలు చేస్తుండగా యంగ్ సైంటిస్ట్ అవార్డుకు ఎంపికయ్యాడు. బయోటెక్నాలజీ విభాగంలో అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ ఏవీరావు పర్యవేక్షణలో పోస్టు డాక్టర్ ఫెల్లోగా పనిచేస్తున్నారు. యంగ్ సైంటిస్ట్ అవార్డుకు ఫణికుమార్ ఎంపికకావడంపై బంధువులు,గ్రామస్తులు అభినందించారు.

ఓడీఎఫ్ ప్లస్‌పై రెండో రోజు శిక్షణ

నిడమనూరు : మండలంలోని వెనిగండ్ల గ్రామ పంచాయతీలో ఓడీఎఫ్ ప్లస్ కార్యక్రమంపై సర్పంచ్‌లు, కార్యదర్శులకు రెండో రోజు మంగళవారం శిక్షణ నిర్వహించారు. గ్రామాలను బహిరంగ మలమూత్ర రహిత గ్రామాలుగా మార్చే కార్యక్రమం, పారిశుద్ధ్య సమస్యపై ప్రణాళిక రూపకల్పన తయారీ విధానం, తాగు నీటి సరఫరాకు మెరుగైన పద్ధతులను శిక్షణ ఇచ్చారు. క్షేత్రస్థాయిలోకి తీసుకెళ్లి శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. వార్డుల్లో ఇంటింటి సర్వే నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కో ఆర్డినేటర్ శంకర్ బాబు, ఎంపీపీడీఓ ప్రమోద్‌కుమార్, ఎంపీఓ రామలింగయ్య, సర్పంచ్ పోలే డేవిడ్, సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

కూలీల హాజరుశాతం పెంచాలి

అడవిదేవులపల్లి: జాతీయ ఉపాధి హామీ కింద కూలీలందరికీ పనులను కల్పిస్తూ.. హాజరు శాతం పెంచాలని జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారిణి (డీఆర్‌డీఓ) కాళిందిని అన్నారు. మంగళవారం అడవిదేవులపల్లి మండల పరిషత్ కార్యాలయంలో అధికారులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆమె మాట్లాడారు. పన్ను బకాయిలు సకాలంలో వసూలు చేయాలన్నారు. నర్సరీల్లో షేడ్ నెట్‌లు ఏర్పాటు చేసి వందశాతం మొక్కలను పెంచి జూన్ మొదటి వారం వరకు ప్రభుత్వ, అవెన్యూ, విద్యా సంస్థల్లో నాటించాలన్నారు. సమావేశంలో ఎంపీడీఓ మహ్మద్ షరీఫ్, ఎంపీఓ లలిత, పంచాయతీ కార్యదర్శి వాసుదేవారెడ్డి, ఏపీఎం ఝాన్సీ ఉన్నారు.

పిల్లర్లకే పరిమితం !



పిల్లర్ల దశలో ఉన్న ఎస్సీ కమ్యూనిటీ హాల్ నిర్మాణం

- పూర్తికాని ఎస్సీ కమ్యూనిటీ హాల్ నిర్మాణం
- 2019లో రూ.29లక్షల నిధులు మంజూరు
- కాంట్రాక్టర్ నిర్లక్ష్యంతో నిలిచిన పనులు

కొండమల్లేపల్లి : కొండమల్లేపల్లి మండల కేంద్రంలోని బీసీ కాలనీలో ఎస్సీ గురుకుల పాఠశాలకు వెళ్లే మార్గంలో ఎస్‌డబ్ల్యూడీ నిధులతో చేపడుతున్న ఎస్సీ సామాజికి భవనం నిర్మాణంలో తీవ్ర జాప్యం జరుగుతుంది. 2019లో నిర్మాణ పనులకు శంకుస్థాపన చేయగా ఇప్పటికి నిర్మాణ పనులు పూర్తి కాకపోవడంపై పలువురు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ఎస్‌డబ్ల్యూడీ నిధులు రూ.29లక్షలతో భవన నిర్మాణ పనులు మొదలు పెట్టారు. ఇప్పటి వరకు పిల్లర్ల వరకే పనులు పరిమితం కావడం పనుల్లో జాప్యానికి అర్థంపడుతుంది. ఎస్సీ కమ్యూనిటీ హాల్ నిర్మాణ పనులు నత్తనడకన సాగుతుండడంపై పలువురు అసహనాన్ని వ్యక్తం చేస్తున్నారు. పిల్లర్ల వరకే పనులు జరిపి మట్టి నింపి పనులు తర్వాత పనులు ముందుకు సాగడం లేదనే విమర్శలు ఉన్నాయి. ఇప్పటికైన సంబంధిత కాంట్రాక్టర్ పనులను వేగవంతం చేయాలని, ఆ దిశగా అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.



కమ్యూనిటీ హాల్ శిలాఫలకం

పనులు పూర్తి చేయాలి



సాధ్యమైనంత త్వరగా ఎస్సీ కమ్యూనిటీ హాల్ నిర్మాణ పనులు పూర్తి చేయాలి. 2019లో నిర్మాణ పనులు మొదలు పెట్టినప్పటికీ ఇప్పటికీ పనులు పూర్తి కాలేదు. ఏమైనా సభలు, సమావేశాలు ఏర్పాటు చేసుకోవడానికి కమ్యూనిటి భవనం లేకపోవడంతో ఇబ్బందులు తలెత్తుతున్నాయి. ఇప్పటికైన అధికారులు స్పందించి కమ్యూనిటీ హాల్ నిర్మాణం పూర్తయ్యేలా చూడాలి.

– అందుగుల తిరుపతయ్య, ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు

సమ్మేళనానికి పకడ్బందీ ఏర్పాట్లు చేయాలి

మాడుగులపల్లి : మండలంలోని ఆగామోత్కూర్ గ్రామంలో ఈ నెల 25న నిర్వహించనున్న బీఆర్ఎస్ కార్యకర్తల ఆత్మీయ సమ్మేళనానికి పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని మిర్యాలగూడ ఎమ్మెల్యే నల్లమోతు భాస్కర్‌రావు సూచించారు. ఆత్మీయ సమ్మేళనం నిర్వహించనున్న మహబూబ్ అలీ ఫంక్షన్ హాల్‌ను మంగళవారం స్థానిక నాయకులతో కలిసి ఆయన పరిశీలించి మాట్లాడారు. మిర్యాలగూడ నియోజకవర్గం పరిధిలోని 13 గ్రామాలకు చెందిన కార్యకర్తలు సమ్మేళనానికి హాజరుకానున్నట్లు తెలిపారు. కార్యకర్తలకు ఇబ్బంది లేకుండా భోజనం, తాగునీటి వసతి, నీడకోసం టెంట్లు ఏర్పాటు చేయాలని పార్టీ మండలాధ్యక్షుడు పాలుట్ల బాబయ్యకు సూచించారు. ఆత్మీయ సమ్మేళనానికి కార్యకర్తలంతా తరలిరావాలని పిలుపునిచ్చారు. నాయకులు సమన్వయంతో పనిచేసి విజయవంతానికి కృషి చేయాలన్నారు. ఎమ్మెల్యే వెంట సర్పంచ్ అఫ్జల్, మాజీ సర్పంచ్ మహబూబ్ అలీ, మాజీ ఎంపీటీసీ నర్సింహ, టీఆర్ఎస్ నాయకులు భూపతి సతీష్, వెంకన్న పాల్గొన్నారు.



స్థానిక నాయకులకు సూచనలిస్తున్న ఎమ్మెల్యే నల్లమోతు భాస్కర్‌రావు

ఆర్టీసీ బస్టాండ్‌లో అన్నదానం

మిర్యాలగూడ టౌన్ : ఇంటర్నేషనల్ వీ104ఏ వాసవీ క్లబ్ రీజియన్ 6 చైర్మన్ రాయపూడి భవాని ప్రోత్సాహంతో మంగళవారం స్థానిక ఆర్టీసీ బస్టాండ్‌లో అమవాస్య అన్నదాన కార్యక్రమాన్ని వాసవీ, వనిత క్లబ్ ఆధ్వర్యంలో నిర్వహించారు. దాతలు గోపవరపు జ్యోతి శ్యాంసుందర్, గుండా పద్మ వారి చేతుల మీదుగా ప్రయాణికులకు అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో డీఎం పాల్, వనిత క్లబ్ అధ్యక్షురాలు కొప్పులరావూరి రమాదేవి, కోశాధికారి ఉషాబాల, కుసుమాంబ క్లబ్ కార్యదర్శి తల్లం పుష్పలత, ట్రెజరరీ గౌరు లత, జోన్ చైర్మన్ భువనగిరి లావణ్య, రీజినల్ సెక్రటరీ తిరునగరు పద్మావతి పాల్గొన్నారు.



అన్నదానం చేస్తున్న దాతలు

కవిత్వం రాయడమంటే జీవితాన్ని రాసుకోవడమే



మాట్లాడుతున్న రచయిత్రి పద్మ

మిర్యాలగూడ టౌన్ : కవిత్వం రాయడమంటే జీవితాన్ని రాసుకోవడమేనని ప్రముఖ రచయిత్రి ఉప్పల పద్మ అన్నారు. మంగళవారం స్థానిక బకల్‌వాడీ ఉన్నత పాఠశాలలో ప్రపంచ కవితా దినోత్సవం సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో ఆమె ముఖ్య అతిథులుగా పాల్గొని మాట్లాడారు. అనంతరం ఆర్టీసీ రిటైర్డ్ ఉద్యోగి లక్ష్మయ్య ఆర్టీసీ డీఎం బొల్లెద్దు పాల్ తనదైన శైలీలో పాట పాడి పలువురుని ఆకట్టుకున్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు కొన్ని కవితలను ఇంగ్లీష్‌లో రాయడంతో వారికి ప్రత్యేకంగా బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ కవి రావిరాల అంజయ్య, వెంకటరత్నం, కరణ్మయి, కస్తూరి ప్రభాకర్, ఉమాశంకర్ తదితరులున్నారు.

అక్రంగా రేషన్ బియ్యం తరలిస్తే వాహనాలు సీజ్

దేవరకొండ : రేషన్ బియ్యం అక్రమ రవాణాకు వినియోగించే వాహనాలు, ఆ వాహనాన్ని నడిపిన వ్యక్తికి సంబంధించి డ్రైవింగ్ లైసెన్స్ సైతం రద్దుకు సిఫారసు చేస్తానని దేవరకొండ పౌరసరఫరాల శాఖ ఎన్‌ఫోర్స్‌మెంట్ డీటీ మాచన రఘునందన్ హెచ్చరించారు. మంగళవారం దేవరకొండ పట్టణంలోని డిండి చౌరస్తాలో పలు వాహనాలను ఆపి ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. అంతే కాకుండా ఎవరైనా ఇళ్లల్లో రేషన్ బియ్యాన్ని అక్రమంగా నిల్వ చేసినట్లు తెలిస్తే చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు.

నేడు రేషన్ దుకాణాలు తెరవాలి

డిండి : ఉగాది పండుగ రోజు (నేడు) రేషన్ దుకాణాలను తెరచి వినియోగదారులకు బియ్యం పంపిణీ చేయాలని జిల్లా ఎన్‌ఫోర్స్‌మెంట్ డిప్యూటీ తహసీల్దార్ మాచన రఘునందన్ మంగళవారం ఒక ప్రకటనలో రేషన్ డీలర్లకు సూచించారు. ఈ సందర్భంగా రేషన్ షాపు తెరవకపోతే వినియోగదారుడు ఆ ప్రాంత డీలర్‌పై టోల్ ఫ్రీ నంబర్ 7997512345 ఫోన్ చేసి ఫిర్యాదు చేయవచ్చునని ఆయన పేర్కొన్నారు.

పాఠశాలకు కంప్యూటర్ బహూకరణ

మిర్యాలగూడ టౌన్ : మండలంలోని తడకమళ్ల గ్రామానికి చెందిన ప్రాథమిక పాఠశాల పూర్వ విద్యార్థులు, ఉద్యోగుల వేదిక తరుపున తాము చదువుకు పాఠశాలకు కంప్యూటర్ బహూకరించారు. ఈ కంప్యూటర్‌ను పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు జోస్పిన్‌కు మంగళవారం అందజేశారు. ఈ సందర్భంగా పాఠశాల పూర్వ విద్యార్థులు సల్లోజు సురేష్, దేవిరెడ్డి అనిల్, బోరా వెంకన్న, రాచూరి జానకిరామయ్య మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో డిజిటల్ బోధన సమర్థంతంగా అమలు చేయడానికి కావడానికి విద్యార్థులకు పాఠాలు అర్థమయ్యే విధంగా బోధించేందుకు పాఠశాలకు ఉద్యోగుల వేదిక తరుపున కంప్యూటర్ బహూకరించినట్లు తెలిపారు. పూర్వ విద్యార్థులు పాఠశాలకు కంప్యూటర్ బహూకరించడంపై పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు జోస్పిన్ ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు నాగయ్య, సైదులు, కల్పన పాల్గొన్నారు.



కంప్యూటర్ అందజేస్తున్న పూర్వ విద్యార్థులు

‘మన ఊరు–మన బడి’తో బడులు బలోపేతం

- ఎమ్మెల్యే రవీంద్రకుమార్

దేవరకొండ : తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ‘మన ఊరు–మన బడి’ పథకం కార్యక్రమంతో ప్రభుత్వ పాఠశాలలు మరింత బలోపేతం కానున్నట్లు బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు, దేవరకొండ ఎమ్మెల్యే రమావత్ రవీంద్రకుమార్ అన్నారు. మంగళవారం దేవరకొండ పట్టణంలోని గాంధీనగర్ ప్రభుత్వ పాఠశాలలో రూ.3.54లక్షలతో చేపట్టిన ‘మన ఊరు–మన బడి’ మొదటి విడుత కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. గత పాలకుల నిర్లక్ష్యంతో ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతులు కరువయ్యాయని ఆయన పేర్కొన్నారు. తెలంగాణ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక విద్యారంగ పరిరక్షణకు శ్రీకారం చుట్టినట్లు తెలిపారు. ప్రభుత్వ పాఠశాలల్లో ప్రైవేటుకు దీటుగా ప్రభుత్వం నాణ్యమైన విద్యను అందిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ ఆలంపల్లి నర్సింహ, శిరందాసు కృష్ణయ్య, కమిషనర్ వెంకటయ్య, ఎంఈఓ మాతృనాయక్, కౌన్సిలర్లు కొంఢ్ర మల్లీశ్వరీశ్రీశైలం యాదవ్, నాయకులు తౌఫిక్, ఇలియాస్, సైదులు, బొడ్డుపల్లి కృష్ణ, పొట్ట మధు, వెంకటయ్య పాల్గొన్నారు.



పాఠశాలలో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే

సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలి



మాట్లాడుతున్న జూలకంటి రంగారెడ్డి

మిర్యాలగూడ : టీఎస్‌పీఎస్సీ పేపర్ల లీకేజీపై సిట్టింగ్ జడ్జితో సమగ్ర విచారణ జరిపించాలని మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి డిమాండ్ చేశారు. మంగళవారం మిర్యాలగూడ పట్టణంలోని సీపీఎం కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. ఎంతో మంది నిరుద్యోగులు సంవత్సరాల తరబడి చదివి ఉద్యోగాల కోసం ఎదురుచూస్తున్నారని, పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. లీకేజీ వ్యవహారంలోని బాధ్యులను కఠినంగా శిక్షించాలని, మళ్లీ ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చూడాలన్నారు. రద్దయిన పరీక్షలను తిరిగి పకడ్బందీగా నిర్వహించాలని సూచించారు. ఇటీవల అకాల వర్షాలతో దెబ్బతిన్న పంటల వివరాలు సేకరించి నష్టపోయిన రైతులను ఆదుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సమావేశంలో సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యులు పాదూరి శశిధర్‌రెడ్డి, రొండి శ్రీనివాస్, బీఎం.నాయుడు, గుణగంటి రాంచంద్రు, పాపిరెడ్డి, రామారావు పాల్గొన్నారు.

హాలియాకు చేరుకున్న సైకిల్ యాత్ర

- దేశంలో శాంతి వాతారణం ఉండేలా చూడాలని 13 రాష్ట్రాల్లోని ప్రముఖ పుణ్యక్షేత్రాలను చుట్టేసిన కర్ణాటక వాసి
- గతేడాది మార్చి 11న కర్ణాటకలో యాత్ర ప్రారంభం

హాలియా: దేశంలో ఘర్షణలు లేకుండా చూడాలని, శాంతి వాతావరణం ఉండేలా చూడాలని కర్ణాటక రాష్ట్రంలోని రాయచూరు జిల్లా సింధనూరు పట్టణానికి చెందిన విజయ్ గోపాలకృష్ణ సైకిల్ యాత్ర చేపట్టి పలు రాష్ట్రాల్లోని పుణ్యక్షేత్రాలను సందర్శిస్తున్నాడు. 2022 మార్చి 11న సింధనూరులో ప్రారంభమైన ఈ సైకిల్ యాత్ర 13 రాష్ట్రాల గుండా సాగి మంగళవారం హాలియా పట్టణానికి చేరుకుంది. ఈ సందర్భంగా స్థానికంగా విజయ్ గోపాలకృష్ణ విలేకరులతో మాట్లాడుతూ.. దేశం శాంతితో నిండాలని, ఘర్షణలు లేకుండా చూడాలని తాను సైకిల్ యాత్రను ప్రారంభించినట్లు తెలిపారు. 250 రోజుల పాటు పలు ప్రాంతాల్లో తిరిగానని, ప్రస్తుతం తిరుపతి, రామేశ్వరం ప్రాంతాలకు వెళ్తున్నట్లు పేర్కొన్నారు. ఉదయం సైకిల్‌యాత్ర మొదలుపెట్టి మధ్యాహ్నం కాస్త విశ్రాంతి తీసుకుని అనంతరం మళ్లీ ప్రయాణం సాగిస్తానన్నారు. ఇప్పటి వరకు ఘనాపూర్, తుల్జాపూర్, షిర్డీ, నాసిక్, త్రయంబకేశ్వరం, గుజరాత్ రాష్ట్రంలోని నర్మదానది, నాందేడ్, బాసర, త్రివేణి, కాశీ, అయోధ్య, ఆగ్రా, లక్నో, మధుర, హరియాణా, తమిళనాడు, కేరళ, పంజాబ్, సింధూ నది ప్రాంతాల్లో పర్యటించి అక్కడ ఉండే ప్రముఖ ఆలయాలు, నదులను సందర్శించినట్లు ఆయన పేర్కొన్నారు.




హాలియాలో విజయ్ గోపాలకృష్ణ

ఇంటర్ పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలి

కొండమల్లేపల్లి : ఇంటర్ వార్షిక పరీక్షలను ప్రశాంత వాతావరణంలో పకడ్బందీగా నిర్వహించాలని జిల్లా ఇంటర్ విద్యా కమిటీ సభ్యులు సూచించారు. మంగళవారం మండల కేంద్రంలోని శ్రీ క్రాంతి జూనియర్ కళాశాల, ఎస్సీ బాలికల గురుకుల కళాశాలలో ఏర్పాటు చేసిన పరీక్ష కేంద్రాలను వారు తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎలాంటి మాస్ కాపీయింగ్‌కు తావులేకుండా పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలని సూచించారు. పరీక్ష కేంద్రాలను తనిఖీ చేసిన వారిలో కమిటీ సభ్యులు వి.భానునాయక్, కె.నరేందర్‌కుమార్, పరీక్ష కేంద్రాల నిర్వాహకులు సురేష్‌కుమార్, రామస్వామి పాల్గొన్నారు.

మాజీ ఎంపీటీసీ పంతునాయక్‌కు నివాళి



మృతదేహంపై పూలమాల వేసి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్సీ కోటిరెడ్డి

తిరుమలగిరి(నాగార్జునసాగర్): మండలంలోని రంగుండ్ల గ్రామానికి చెందిన ఆ గ్రామ మాజీ ఎంపీటీసీ, బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు ధరావత్ పంతు నాయక్ మంగళవారం ఉదయం గుండెపోటుతో మృతి చెందాడు. ఈ విషయం తెలుసుకున్న ఉమ్మడి నల్లగొండ జిల్లా ఎమ్మెల్సీ ఎంసీ కోటిరెడ్డి రంగుండ్ల తండాలోని ఆయన నివాసానికి వెళ్లి మృతదేహంపై పూలమాల వేసి నివాళులర్పించారు. ఆయన వెంట ఎంపీపీ భగవాన్ నాయక్, జెడ్పీటీసీ అంగోతు సూర్యబాషా నాయక్, వైస్ ఎంపీపీ దిలీప్‌రెడ్డి, సర్పంచ్‌ల ఫోరం మండల అధ్యక్షుడు జయరాం నాయక్, స్థానిక సర్పంచ్ లీలా, ఎంపీటీసీల ఫోరం మండల అధ్యక్షుడు రాజశేఖర్‌రెడ్డి, సర్పంచ్‌లు పాల్గొన్నారు.

క్రీడలతో మానసికోల్లాసం : డీఎస్పీ

అడవిదేవులపల్లి : క్రీడలు మానసిక ఉల్లాసాన్ని, స్నేహ భావాన్ని పెంపొందిస్తాయని మిర్యాలగూడ డీఎస్పీ వెంకటగిరి అన్నారు. మంగళవారం మండలంలోని చాంప్లాతండాకు చెందిన అంగోతు నాగేశ్వర్‌రావు ప్రథమ వర్ధంతి సందర్భంగా ఆయన కుమారుడు, అలంపూర్ సీఐ అంగోతు సూర్యానాయక్ ఆధ్వర్యంలో మండల కేంద్రంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో కబడ్డీ, వాలిబాల్, క్రికెట్, చెస్, క్యారమ్స్, వ్యాసరచన పోటీలను ఆయన ప్రారంభించి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ ధనావత్ బాలాజీనాయక్, జెడ్పీటీసీ కుర్ర సేవ్యానాయక్, మిర్యాలగూడ రూరల్ సీఐ ముత్తినేని సత్యనారాయణ, వన్ టౌన్ సీఐ రాఘవేందర్, అడవిదేవులపల్లి ఎస్ఐ వై. హరిబాబు, మాజీ ఎంపీపీ కురాకుల మంగమ్మచిన రామయ్య, బీఆర్ఎస్ మండల పార్టీ ప్రధాన కార్యదర్శి కుర్ర శ్రీనునాయక్, సర్పంచులు బాలునాయక్, పకీరానాయక్, బాలానాయక్, ఎంపీటీ సీ పేర్ల లింగయ్య, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు అబ్బాస్ అలీ, ఎస్ఎంసీ చైర్మన్ పసుపులేటి శ్రీనివాస్ తదితరులున్నారు.



పోటీలను ప్రారంభిస్తున్న డీఎస్పీ వెంకటగిరి

చిరుధాన్యాల ప్రాముఖ్యతపై అవగాహన

అడవిదేవులపల్లి : పోషణ పక్వాడ కార్యక్రమంలో భాగంగా మంగళవారం అడవిదేవులపల్లిలో చిరుధాన్యాలపై వంటలను నిర్వహించి వాటి ప్రాముఖ్యతపై గర్భిణులు, బాలింతలకు ఐసీడీఎస్ సూపర్‌వైజర్ నాగమణి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి కుటుంబంలో చిరు ధాన్యాలు వాడాలని, కెమికల్ లేకుండా ఆర్గానిక్ పంటల్లో లభించే ఈ చిరుధ్యాన్యాల్లో మానవ శరీర నిర్మాణానికి సరిపడా విటమిన్స్ మినరల్ పుష్కలంగా లభిస్తాయ న్నారు. మన ఆరోగ్యానికి ఎంతో తోడ్పాడతాయని, చిరు ధాన్యాలను ప్రతి రోజు జావగాని, రొట్టెలుగాని చేసుకోని ఆహారంగా తీసుకోవాలని వివరించారు. ఈ ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు నారాయణమ్మ, శోభ, రమాదేవి, రేణుకలతో పాటు గర్భిణీలు, కిశోరబాలికలు, తదితరులు పాల్గొన్నారు.



అవగాహన కల్పిస్తున్న ఐసీడీఎస్ అధికారులు

స్వపరిపాలన దినోత్సవం



స్వపరిపాలన దినోత్సవంలో పాల్గొన్న విద్యార్థులు, ఉపాధ్యాయులు

గుర్రంపోడు : మండలంలోని జూనూతల ప్రాథమికోన్నత పాఠశాలలో మంగళవారం స్వపరిపాలనాదినోత్సవాన్ని ఘనంగా జరుపుకున్నారు. విద్యార్థులే ఉపాధ్యాయులుగా వేషధారణతో పాఠాలు బోధించి ఆకట్టుకున్నారు. అనంతరం విదార్థులకు బహుమతులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ కంచర్ల జగదీశ్వర్‌రెడ్డి, ఎస్ఎంసీ చైర్మెన్ సైదయ్య, ప్రధానోపాధ్యాయులు అన్నపురెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కుక్కడంలో ఇంటిగోడ కూల్చివేత

- రాజకీయ జోక్యంతోనే కూల్చేశారని బాధితుడి ఆరోపణ
- వివాదాస్పదంగా మారిన విషయం

మాడుగులపల్లి : మండలంలోని కుక్కడం గ్రామంలో పంచాయతీ అనుమతులు లేకుండా, దారిని ఆక్రమించి ఇంటి గోడ నిర్మించాడని ఆరోపిస్తూ పంచాయతీ కార్యదర్శి మంగళవారం గోడను కూల్చివేశారు. కాగా రాజకీయ జోక్యంతోనే తన ఇంటి గోడను కూల్చారని బాధితుడు ఆరోపిస్తుండడంతో విషయం వివాదాస్పదంగా మారింది. వివరాలివి.. గ్రామానికి చెందిన పందిరి భిక్షం తన 30 గజాల స్థలంలో కొత్తగా ఇంటిని నిర్మించుకుంటున్నాడు. నిబంధనలకు విరుద్ధంగా నిర్మాణం చేపడుతున్నట్లు పేర్కొంటూ పంచాయతీ కార్యదర్శి షకీరాబేగం, సర్పంచ్ గోవిందరెడ్డితో కలిసి అక్కడకు చేరుకొని నిర్మాణంలో ఉన్న గోడను కూల్చివేశారు.

గతంలోనే యాజమాన్య హక్కు ధ్రువీకరించారు : బాధితుడు

పంచాయతీ కార్యదర్శి తన స్థలం హద్దులు గుర్తిస్తూ గతంలోనే యాజమాన్య హక్కు పత్రం జారీ చేశారని, ఇంటిని నిర్మిస్తుండగా ఇప్పుడేమో నిబంధనలకు విరుద్ధమంటూ గోడ కూల్చేశారని బాధితుడు భిక్షం ఆరోపించారు. తనకు వారసత్వంగా వచ్చిన భూములోనే ఇంటిని నిర్మించుకుంటున్నానని, దారిని ఆక్రమించలేదని అన్నారు. రాజకీయ జోక్యంతో కొందరి ప్రోద్బలంతో పంచాయతీ అధికారి తన ఇంటి గోడ కూల్చారని ఆక్షేపించారు. విషయం కోర్టు పరిధిలో ఉన్నా.. నిబంధనకు విరుద్ధంగా వ్యవహరించారని పేర్కొన్నారు. ఈ విషయంపై పంచాయతీ కార్యదర్శిని వివరణ కోరగా.. ×విషయం కోర్టు పరిధిలో ఉన్న మాట వాస్తవం. నిర్మాణానికి అనుమతి తీసుకోకుండా..దారి ఆక్రమించి గోడ నిర్మిస్తున్నట్లు గుర్తించి కూల్చివేశాం. గతంలో యాజమాన్య హక్కు పత్రం జారీలో పొరపాటు జరిగింది. దీనిని గుర్తించి పంచాయతీలో తీర్మానం చేసి తొలగించాం. స్థల యజమాని భిక్షానికి నోటీసులు జారీ చేశాం. ఇదే విషయాన్ని కోర్టుకూ నివేదించాం అని పంచాయతీ కార్యదర్శి షకీరాబేగం తెలిపారు.



వివాదానికి కారణమైన ఇంటిస్థలం

పాఠశాలల్లో ఉగాది సంబరాలు

నాగార్జునసాగర్ : నందికొండ మున్సిపాలిటీలోని హైలాన్‌కాలనీలో గల డీఏవీ పాఠశాలలో మంగళవారం ఉగాది సంబరాలను నిర్వహించారు. విద్యార్థులు తెలంగాణ సంస్కృతీ సంప్రదాయాలను ప్రతిబింబించే విధంగా ప్రదర్శనలను ఏర్పాటు చేశారు. జానపదకళలు, దేవాళయాలు, గ్రామదేవతల పండుగల నిర్వహణ, దర్శనీయ స్థలాలు, వృత్తులు తదితర అంశాలను అద్భుతంగా ప్రదర్శించారు. ముఖ్యఅతిథిగా హాజరైన జెన్‌కో చీఫ్‌ఇంజనీర్ వి.మంగేష్‌కుమార్ ప్రదర్శనలను ప్రారంభించి తిలకించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఈ కార్యక్రమంలో జెన్‌కో ఎస్‌ఈ బిరఘురాం, సివిల్ ఎస్‌ఈ రామకృష్ణ, పాఠశాల ప్రధానోపాధ్యాయులు భార్గవ, పాల్గొన్నారు.

మిర్యాలగూడ టౌన్ : పట్టణంలోని చైతన్యనగర్‌లోని శిష్య పాఠశాలలో శ్రీ శోభకృత్ నామ ఉగాది పర్వదినంను పురస్కరించుకొని మంగళవారం ఉగాది వేడుకలను ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు, ఉపాధ్యాయునీ, ఉపాధ్యాయులు షడ్రుచులతో తయారు చేసిన ఉగాది పచ్చడి స్వీకరించారు. ఈ సందర్భంగా సెయింట్ జాన్స్ హైస్కూల్, శిష్య పాఠశాల విద్యా సంస్థల చైర్మన్ అలుగుబెల్లి శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు అంజయ్యాచారి, నాగరాజు, రమేష్, వసంతలక్ష్మి, పద్మావతి, భాగ్యరేఖ, స్వాతిప్రియ, ధనలక్ష్మి, భవానీ, తదితరులున్నారు.



మిర్యాలగూడ టౌన్ : శిష్య పాఠశాలలో ఉగాది వేడుకలు

ఎంకేఆర్ డిగ్రీ కళాశాలలో..

దేవరకొండ : దేవరకొండ పట్టణంలోని ఎంకేఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మంగళవారం తెలుగు శాఖ, సాంస్కృతికశాఖ ఆధ్వర్యంలో ఉగాది కవి సమ్మేళనాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ప్రముఖ కవి, పాత్రికేయులు పున్న అంజయ్య ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకొని తన కవితలతో విద్యార్థులను అలరించారు. తెలుగు నూతన సంవత్సరాది ఉగాది పర్వదినాన్ని ఘనంగా జరుపుకోవాలని ఆయన కోరారు. అనంతరం కళాశాల విద్యార్థులకు ఉగాది పర్వదిన విశిష్టతను వివరించారు. కళాశాల ప్రిన్సిపాల్ రామరాజు అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో గాయకుడు నల్ల నర్సింహ, ఆకారపు పాండురంగం, కళాశాల అధ్యాపకులు కోటయ్య, శ్రీను, బాల, అలివేలు, విద్యార్థులు పాల్గొన్నారు.